ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 28 అక్టోబరు 2024



నమ్మినవారికే రూ.రెండు కోట్లకు కుచ్చుటోపీ?

అమ్మమ్మా..! ఎంత మోసం



సొంత పార్టీ వారికే రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుచ్చు టోపీ పెట్టారు. మాజీ ఎమ్మెల్యే ప్రారంభించిన అమ్మ డెయిరీకి పాలు సరఫరా చేసిన ఏజెంట్లకు దాదాపు రూ. రూ.రెండు కోట్ల బకాయి పడ్డారు. బిల్లుల కోసం ఐదు నెలలుగా డెయిరీ ఏజెంట్లు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇంటి చుట్టూ తిరుగుతున్నా ఒక్కరికి పైసా కూడా ఇవ్వలేదు. మొత్తం 40మంది డెయిరీ ఏజెంట్లలో 99 శాతం మంది వైసీపీకి చెందిన వారే. సొంత పార్టీకి చెందిన ఏజెంట్లకు ఒక్కొక్కరికి రూ. లక్షల్లో బిల్లులు ఇవ్వకపోవడంపై తీవ్రంగా విమర్శిస్తున్నారు. సొంతపార్టీ వారికే ఎగనామం పెట్టినవాడు మిగతా ప్రజలను ఏమి ఉద్ధరిస్తాడని ఎద్దేవా చేస్తున్నారు. - రాప్తాడు/ఆంధ్రజ్యోతి

- అమ్మ డెయిరీ ఏజెంట్లకు తోపుదుర్తి బిల్లుల బకాయి
- 5 నెలలుగా ఏజెంట్లను తిప్పుకుంటున్న మాజీ ఎమ్మెల్యే
- ఏజెంట్లలో 99 శాతం మంది వైసీపీ మద్దతుదారులే
- నమ్మకద్రోహం చేశారని ఆగ్రహం



ఆలమూరు సమీపంలోని అమ్మ డెయిరీ

చెప్పింది ఒకటి.. చేసింది మరోటి

వైసీపీ పాలనలో అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి 2023లో అనంతపురం రూరల్ మండలం ఆలమూరు సమీపంలో అమ్మ డెయిరీ ఏర్పాటు చేశారు. జూన్ 14న అప్పటి అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి డెయిరీ ప్రారంభించారు. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, 10 వేల మంది డ్వాక్రా మహిళల యాజమాన్యంతో డెయిరీ ఏర్పాటు చేసి, అందులో వచ్చిన ఆదాయాన్ని ఏడాదికి ఒక సారి ఆ మహిళలకు పంచుతామన్నారు. రోజుకు లక్ష లీటర్ల పాలు సేకరించి పాడి రైతులకు భరోసా కల్పిస్తామని చెప్పారు. ఈ మాటలు నమ్మి రాప్తాడు నియోజకవర్గం వ్యాప్తంగా అనేక మంది ఏజెంట్లు గ్రామాల్లో రైతుల నుంచి పాలు సేకరించి అమ్మ డెయిరీకి తరలించారు. అయితే ప్రారంభించిన కొన్ని నెలలకే డెయిరీ నష్టాల బాట పట్టింది. దీంతో డెయిరీ యాజమాన్యం ఏజెంట్లకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో ఏజెంట్లు కూడా గ్రామాల్లో పాలు పోసే రైతులకు కొన్నాళ్లు బిల్లులు ఆలస్యంగా చెల్లించారు. కొన్ని నెలలకు అమ్మ డెయిరీ నుంచి ఏజెంట్లకు బిల్లులు పూర్తిగా ఆగిపోయాయి. గ్రామాల్లో రైతుల నుంచి ఒత్తిడి ఎక్కువ అవ్వడంతో ఏజెంట్లు ఇతరుల వద్ద వడ్డీకి తెచ్చి రైతులకు బిల్లులు చెల్లించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో అమ్మ డెయిరీకి పాల సరఫరా చాలా తగ్గిపోయింది. బిల్లులు ఒక్కోక్కరికి రూ. లక్షల్లో పెండింగ్ ఉండటంతో ఏజెంట్లు పాల సరఫరా పూర్తిగా బంద్ చేశారు.

కాళ్లరిగేలా తిరిగినా..

అమ్మ డెయిరీ నుంచి పాల బిల్లుల కోసం ఏజెంట్లు అనంతపురం నగరంలోని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇంటి వద్దకు తరచూ వెళ్లారు. మొదటి సారి ఏజెంట్లు వెళ్లినప్పుడు ఎవరెవరికి ఎంత రావాల్సి ఉందో పరిశీలించి, డెయిరీకి రావాల్సిన బకాయిలు రాగానే మొత్తం ఇచ్చేస్తామని తోపుదుర్తి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ తరువాత అనేక సార్లు ఏజెంట్లు తోపుదుర్తి ఇంటి వద్దకు వెళ్లినప్పుడు అదిగో ఇస్తాం. ఇదిగో ఇస్తాం అంటూ కాలయాపన చేశారు. ఎన్ని సార్లు తిరిగినా ఏజెంట్లకు చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదు.

ఏం చేసుకుంటారో చేసుకోండి

ఆరు రోజుల కిందట అనంతపురం నగరంలోని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇంటి వద్దకు దాదాపు 20 మంది ఏజెంట్లు వెళ్లారు. ఆ సమయంలో ప్రకాష్‌రెడ్డి ఇంట్లో లేరు. వాళ్ల నాన్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ఉన్నారు. మా బకాయి డబ్బు వెంటనే ఇవ్వాలని ఏజెంట్లు నిలదీశారు. ఎన్ని సార్లు మీ ఇంటి చుట్టూ తిరగాలి. మేము వడ్డీకి అప్పులు తెచ్చి రైతులకు పాల బిల్లులు చెల్లించాం. మాకు మీరు బకాయిలు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా దగ్గర డబ్బు లేదని, మా బీరువాలు ఖాళీగా ఉన్నాయని కావాలంటే చూసుకోండి అని తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి సమాధానం ఇచ్చారు. ఈ క్రమంలో ఏజెంట్లు తమ బకాయిలు ఇవ్వాల్సిందేనని లేదంటే మేమందరం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని, ధర్నా చేస్తామన్నారు. మీ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేగా పని చేశారు. మాకు ఇవ్వడానికి మీ దగ్గర డబ్బుల్లేవా అని ఆందోళన వ్యక్తం చేయగా, మీ ఇష్టం వచ్చింది చేసుకోండి. ఎస్పీ ఫోన్ నెంబర్ ఇవ్వాలా రాసుకోండి. చెప్తాను. ధర్నా కాకుంటే ఏం అయినా చేసుకోండి. అని నిర్లక్ష్యంగా తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి మాట్లాడారని ఏజెంట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పత్తాలేని తోపుదుర్తి

మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి 2024 సార్వత్రికి ఎన్నికల తరువాత డెయిరీ ఏజెంట్లకు కనిపించ లేదు. అప్పట్లో ప్రకాష్‌రెడ్డిపైన ఉన్న నమ్మకంతోనే వైసీపీకి మద్దతుదారులైన ఏజెంట్లు అమ్మ డెయిరీకి పాలు సరఫరా చేశారు. అయితే ఏజెంట్లకు దాదాపు రూ. 2 కోట్లు బకాయిలు చెల్లించకుండా, ఎప్పుడిస్తారనే సమాధానం కూడా చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏజెంట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సొంత పార్టీకి చెందిన వారినే ప్రకాష్‌రెడ్డి ఇంత మోసం చేస్తాడని కలలో కూడా ఊహించలేదని ఏజెంట్లు కన్నీటి పర్యంతమవుతున్నారు. వడ్డీకి అప్పులు చేసి రైతులకు పాల బిల్లుల్లు చెల్లిస్తే మాకు బకాయిలు ఇవ్వకుండా పెద్ద మోసం చేశాడని వాపోతున్నారు.

బకాయిల్లో కొన్ని..

బండమీదపల్లికి చెందిన విశ్వనాథ్‌రెడ్డికి రూ. 20లక్షలు, శివయ్యకు రూ. 10లక్షలు, ఆత్మకూరుకు చెందిన శిరీషకు రూ. 18లక్షలు, సుధాకర్‌కు రూ. 12లక్షలు, యాలేరు ఈశ్వర్‌రెడ్డికి రూ. 12లక్షలు, తలుపూరు పరమేశ్వర్‌రెడ్డికి రూ. 4లక్షలు, వడ్డుపల్లి రాముకు రూ. 4లక్షలు, ననప శివయ్యకు రూ. 10లక్షలు, తగరకుంటకు చెందిన వెంకటరెడ్డికి రూ. 18లక్షలు, కొత్తపల్లి కొండప్పకు రూ. 6లక్షలు, సిద్దరాంపురానికి చెందిన వన్నూరుస్వామికి రూ. 3లక్షలు, తోపుదుర్తి పెద్దయ్యకు రూ. 14లక్షలు ఇవ్వాల్సి ఉందని ఏజెంట్లు తెలిపారు. ఇలా మరి కొందరు ఏజెంట్లకు కూడా ఒక్కొక్కరికి రూ. లక్షల్లో ఇవ్వాల్సి ఉంది.


మృత దేహాలను సందర్శిస్తున్న బంధువులు, భక్తులు



కన్నీటి వీడ్కోలు

- ఇస్కాన్ భక్తులకు వేలాదిగా నివాళి
- జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు
- బరువెక్కిన హృదయాలతో అంతిమ సంస్కారాలు

8 లో

కాటేసిన కరెంటు

విద్యుదాఘాతంతో మహిళారైతు మృతి

విడపనకల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మిరప పంటకు నీళ్లు పెడుతు విద్యుదాఘాతానికి గురై మహిళా రైతు వరలక్ష్మి(32) మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం విడపనకల్లు శివారులో జరిగింది. మండలంలోని హావళిగి గ్రామానికి చెందిన పెన్నయ్య, వరలక్ష్మి దంపతులు విడపనకల్లు గ్రామంలో మిరప పంటను సాగు చేశారు. పంటకు నీళ్లు పెట్టేందుకు ఆదివారం ఉదయం వీరిద్దరూ తోట వద్దకు వచ్చారు. పెన్నయ్య బోరు మోటార్‌ను ఆన్ చేసి నీళ్లను మిరప సాళ్లకు మళ్లించమని భార్య వరలక్ష్మికి చెప్పి మరో పొలానికి వెళ్లి పోయాడు. వరలక్ష్మి మధ్యాహ్నం వరకు మిరప సాళ్లకు నీళ్లు కట్టింది. మోటారుకు కనెక్షన్ ఇచ్చిన విద్యుత్ వైరు పొలానికి ఉన్న ముళ్ల కంచెకు తగులుకుని ఉంది. ఈక్రమంలోనే కంచె వైపు నీళ్లు వచ్చాయి. గట్టుకు అనుకొని పారతో నీటిని మళ్లిస్తూ ఉండగా విద్యుదాఘాతానికి గురై వరలక్ష్మి అక్కడిక్కడే మృతి చెందింది. కొద్దిసేపటి తర్వాత పక్క పొలం రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హావళిగి గ్రామం నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు వరలక్ష్మి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

ఏమరుపాటుతోనే ప్రమాదం

వ్యవసాయ బోరుకు కనెక్షన్ ఇచ్చిన వైరు నుంచి పొలం గట్టుకు ఉన్న ముళ్ల కంచెకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో శనివారం విద్యుత్ అధికారులతో మరమ్మతులు చేయించారు. అక్కడక్కడ వైరుకు రంధ్రాలు ఉండటంతో ప్లాస్టర్లు వేసి చెక్ చేయించారు. ప్లాస్టర్ సరిపోకపోవడంతో ముళ్లకంచె వద్ద రంధ్రాన్ని అలాగే వదిలేశారు. ముళ్ల కంచె వద్ద విద్యుత్ సరఫరా వస్తోందని, ఎవరూ ఇటువైపు రావద్దని విద్యుత్ అధికారులు రైతు దంపతులకు సూచించారని బంధువులు తెలిపారు. అయితే మిరప పంటకు నీళ్లు పెడుతూ ఏమరుపాటున అటువైపు వెళ్లి వరలక్ష్మి ప్రాణాలు పోగొట్టుకుందని బంధువులు రోదించారు.


విద్యుదాఘాతంతో మృతిచెందిన మహిళారైతు, వరలక్ష్మి (ఫైల్)

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 1169 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో 1,106 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు.

ఆనంద తరంగం..!



కనువిందు చేస్తున్న జలపాతం


ప్రవహిస్తున్న నీరు


నీటిలో పర్యాటకుల సందడి

ఉరవకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పారే యేటిని చూస్తే ఎవరికైనా ఆనందమే. పచ్చని పరిసరాల మధ్య వాగుల్లో హొయలు పోతూ ప్రవహించే జలసిరిని చూస్తే పరవశమే. ప్రకృతి ప్రేమికులు ఇలాంటి ప్రాంతాలను సందర్శిస్తూ ఆనందానుభూతిని పొందుతుంటారు. ఇలాంటి ఆనందానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది పెన్నహోబిలం నారసింహుడి క్షేత్రం. తుంగభద్ర డ్యాం నుంచి మిడ్ పెన్నార్ డ్యాంకు నీటిని విడుదల చేయడంతో ఇక్కడి వాగులో ప్రవాహం కనువిందు చేస్తోంది. సెలవు రోజు కావడంతో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వచ్చారు. పిల్లలతో కలిసి నీటిలో ఆనందంగా ఈత కొట్టారు. సెల్ఫీలు దిగారు. అయితే ఏమరుపాటుతో చిన్న పిల్లలను నీటి వద్ద వదిలేసినా, ప్రమాదకర విన్యాసాలు చేసినా తీరని నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

డీఈఓ బాధ్యతల స్వీకరణ


కొత్త డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ నూతన డీఈఓ ప్రసాద్‌బాబు ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. డీఈఓ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. డీఈఓను జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజక్టు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలు ఉపాధ్యాయ సంఘాలు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, ఇతర నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం విజయవాడలో అన్ని జిల్లాల డీఈఓలతో విద్యాశాఖ కమిషనర్ సమావేశం నిర్వహించనున్నారు. దీంతో మీటింగ్‌లో పాల్గొనేందుకు డీఈఓ విజయవాడ బయలుదేరి వెళ్లారు.

నేటిలోగా స్కూల్ టీమ్స్ రిజిస్టర్ చేసుకోవాలి

డీఈఓ ప్రసాద్ బాబు

అనంతపురం విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ (సిమ్) ఈనెల 28వ తేదీలోగా టీమ్స్ రిజిస్ట్రేషన్ చేయాలని డీఈఓ ప్రసాద్ బాబు, ఏపీసీ నాగరాజు, సైన్స్ ఆఫీసర్ బాలమురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రతి స్కూల్ నుంచి https : //schoolinnovation-marathon.org వెబ్‌సైట్‌లో తమ పాఠశాలలను రిజిస్టర్ చేసుకుని ప్రతి సైన్స్, గణితం టీచర్ ముగ్గురు విద్యార్థులతో ఒక టీం చొప్పున మూడు టీమ్స్‌ను తప్పనిసరిగా రిజిస్టర్ చేయించాలన్నారు. రిజిస్టర్ చేసుకున్న స్కూళ్లకు సిమ్ టీమ్ వారు అన్ని విధాలుగా విద్యార్థులకు శాస్త్రీయ విధానం, నూతన ఆవిష్కరణలపై శిక్షణ ఇస్తారని తెలిపారు.

ఏడుస్తూనే హరినామ సంకీర్తన చేస్తున్న ఇస్కాన్ భక్తులు





శ్రీధర్ ప్రభు కుమారుడు కృష్ణ



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇస్కాన్ భక్తుల భౌతికకాయాలను దర్శించుకునేందుకు వచ్చిన జనం



శంఖం ఊదుతున్న భక్తుడు



రోదిస్తున్న ప్రణవ్ సోదరుడు భువన్

జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు

బరువెక్కిన హృదయాలతో అంతిమ సంస్కారాలు

కన్నీటి వీడ్కోలు

ఇస్కాన్ భక్తులకు వేలాదిగా నివాళి



ప్రణవ్ భౌతికకాయం వద్ద రోదిస్తున్న తల్లి చంద్రలేఖ

నిత్యం శ్రీకృష్ణ నామ స్మరణలతో...
తన్మయత్వం చెందిన భక్తుల నృత్యాలతో
ఆనంద తరంగాలతో శోభించిన ఆ ప్రాంతం
గుండెలు పగిలే బాధతో శోకించింది.

శ్రీకృష్ణ నామ సంకీర్తనలతో
ఎందరిలోనో భక్తి భావం మేల్కొలిపిన
ఆ భక్త బృందం లేరని తెలిసి
ఉబికి వస్తున్న కన్నీటితో శోక సంద్రమైంది.

భక్తుల బృందగానాలతో
అలరారిన శ్రీ కృష్ణ మందిరం
పట్టరాని బాధతో
బరువెక్కిన హృదయాలకు వేదికైంది.

గుండెల్లో ప్రజ్వరిల్లుతున్న బడబాగ్నిని
ఉబికి వస్తున్న కన్నీళ్లతో చల్లార్చుకుంటూ
వాయులీనమై, పరాంధాముడిలో ఐక్యమైన
భక్తశేఖరులకు తుది వీడ్కోలు పలికింది.

నార్పల మండలం నాయునపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ మందిర భక్త బృందానికి ఆదివారం తుది వీడ్కోలు పలికారు. భక్తుల సందర్శనార్థం మృతదేహాలను ఇస్కాన్ మందిరం వద్ద ఉంచారు. కుటుంబ సభ్యులు, బంధువులు, భక్తుల రోదనలతో ఆ ప్రాంతం శోక సంద్రమైంది.



బాధాతప్త హృదయంతో శ్రీకాకులం పయనమవుతున్న షణ్ముఖ్ తండ్రి సాంబమూర్తి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ మందిర భజన బృంద సభ్యులకు వందలాదిమంది నడుమ ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. తాడిపత్రిలోని ఓ గృహంలో శనివారం శ్రీకృష్ణ సంకీర్తన నిర్వహించి తిరిగి అనంతపురానికి వస్తుండగా నాయనపల్లి క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో శ్రీనివాసులు అలియాస్ శ్రీధర్, షణ్ముఖ్, సంతోష్‌కుమార్, వెంకటేష్, లక్ష్మీప్రసన్న కుమార్‌రెడ్డి, ప్రనీత్ ప్రణవ్ సాయిరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన జిల్లా ప్రజలకు దిగ్భ్రాంతి కలిగించింది. మృతదేహాలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆదివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం భౌతికకాయాలను ఇస్కాన్ భక్తుల సందర్శనార్థం నగర శివారులోని ఇస్కాన్ మందిరానికి తరలించారు. ఈ సందర్భంగా మృతుల బంధువులతోపాటు వందలాదిమంది ఇస్కాన్ మందిరానికి చేరుకుని తుదివీడ్కోలు పలికారు. మృతులంతా ఇస్కాన్ మందిర సేవలో ఉన్న వారే కావడంతో భక్తులంతా కన్నీరు మున్నీరయ్యారు.

జిల్లా నలుమూలల నుంచి కదిలొచ్చిన భక్తజనం

ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఈ బృందం చురుగ్గా పాల్గొనేవారు. ప్రధానంగా నగర సంకీర్తనల్లో ఎంతో ఉత్సాహంగా భక్తిగీతాలాపనలు చేస్తూ భక్తుల్లో ఎంతో ఉత్సాహం రేకెత్తించేవారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వీరు నగర సంకీర్తనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అనేక మంది భక్తులతో వీరికి ఎంతో అనుబంధం ఏర్పడింది. వీరి మృతి విషయం తెలుసుకొని జిల్లావ్యాప్తంగా ఈ బృందంతో ఆధ్యాత్మిక అనుబంధం కలిగినవారంతా వందలాదిగా తరలి వచ్చి భౌతికకాయాలను సందర్శించి కన్నీటి పర్యంతమయ్యారు.



భౌతికకాయాల వద్ద హరేకృష్ణ... హరేరామ నామస్మరణ చేస్తున్న ఇస్కాన్ బృందం

బరువెక్కిన హృదయాలతో అంతిమ సంస్కారాలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇస్కాన్ భక్తులకు బంధువులు, భక్తుల సమక్షంలో బరువెక్కిన హృదయాలతో కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఉబికివస్తున్న కన్నీళ్లను అదుపు చేస్తూ, గుండెలు పగిలే బాధ ఉన్నప్పటికీ హరేరామ, హరే కృష్ణ అంటూ సంకీర్తన సాగించారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహాడ్‌పల్లి గ్రామానికి చెందిన షణ్ముఖ్, నాగిరెడ్డిపల్లికి చెందిన లక్ష్మీప్రసన్న కుమార్‌రెడ్డి మృతదేహాలను వారి తల్లిదండ్రులు ప్రత్యేక అంబులెన్సుల ద్వారా వారి స్వస్థలాలకు తీసుకెళ్లారు. అనంతరం శ్రీధర్ ప్రభు, సంతోష్‌కుమార్, వెంకటేష్, ప్రనీత్‌ప్రణవ్ సాయిరెడ్డి భౌతికకాయాలను కైలాస రథాల్లో ఉంచి నగరంలో అంతిమయాత్ర నిర్వహిస్తూ గుత్తిరోడ్డులోని హరిశ్చంద్రఘాట్‌కు తరలించారు. అక్కడ హిందూ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



శ్రీధర్ మృతదేహం వద్ద కన్నీటి పర్యంతమవుతున్న ఆయన సతీమణి దివ్య

నా ప్రభువును నా వద్దే ఉంచండి

దివ్య, శ్రీధర్ ప్రభు(శ్రీనివాసులు) సతీమణి

పెళ్లయిన ఐదేళ్లకే భర్తను కోల్పోయి, భర్త మృతదేహంపై పడి రోదిస్తున్న దివ్య ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. నాలుగేళ్ల నా కుమారుడు కృష్ణ ముద్దుముచ్చట కూడా చూడకుండానే తండ్రి లేకుండా చేసావా భగవంతుడా. మేమెవరికోసం బతకాలి దేవుడా అంటూ శ్రీధర్ ప్రభు(శ్రీనివాసులు) సతీమణి ఏడుపు చూసిన వారంతా కంట తడి పెట్టుకున్నారు. నా శ్రీధర్ ప్రభువును నావద్దనే ఉంచండి.. ఎక్కడికీ తీసుకెళ్లద్దండి అంటూ ఆమె ఏడవడం అందరినీ కలచివేసింది.

కంటతడి పెట్టిన ఎమ్మెల్యే దగ్గుపాటి



ఇస్కాన్ మందిరం వద్ద ఏర్పాటు చేసిన ఇస్కాన్ భక్తుల మృతదేహాలను చూసి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా మృతుల భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చే ప్రయత్నం చేశారు. అయితే వారి రోదనలను చూసి ఆయనకూడా కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ శ్రీకృష్ణుని సేవలో ఉన్న యువకులంతా ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. వారి కుటుంబాలను ఆదుకుంటామన్నారు.



ఇస్కాన్ భక్తులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



ఇస్కాన్ భక్తుల అంతిమయాత్ర



అంబులెన్సులో షణ్ముఖ్ భౌతికకాయాన్ని శ్రీకాకుళానికి తరలిస్తున్న దృశ్యం

వీరి కీర్తనలు వినేందుకే భగవంతుడు తీసుకెళ్లాడు



శ్రీధర్ ప్రభు బృందం పాడే కీర్తనలు చాలా మందిలో భక్తిభావాలు కలిగించాయి. వీరి కీర్తనలను ఇష్టపడనివారుండరు. అందుకేనేమో శ్రీకృష్ణ పరమాత్ముడు కూడా వీరి కీర్తనలను వినాలని తనదగ్గరకు తీసుకెళ్లాడేమో..! అనంతపురంలో ఇస్కాన్ మందిర ఆరంభం నుంచి సభ్యుడిగా కొనసాగుతున్నాను. వీరి మృతి నా జీవితంలో ఏనాడూ కలగనంత మనోవేదనను మిగిల్చింది.

-శ్రీపాద వేణు, ఇస్కాన్ అనంతపురం సభ్యుడు



ఫీల్డ్ అసిస్టెంట్ పట్టా చేయించుకుని సాగుచేస్తున్న భూమి

ఫీల్డ్ అసిస్టెంట్ మరి..!


- నాలుగెకరాలకు భార్య పేరుతో అక్రమంగా పట్టా
- వైసీపీ పాలనలో ఆన్‌లైన్‌లోకి సైతం..
- బాధితుల ఫిర్యాదుతో ఐదేళ్ల తర్వాత వెలుగులోకి..



ఫీల్డ్ అసిస్టెంట్‌కు రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసు

యాడికి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా తన భార్య పేరుతో చేయించుకున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాడికిలోని సర్వే నెంబరు 422-బీలో ప్రభుత్వ మిగులు భూమి సుమారు 40ఎకరాలు ఉంది. ఇందులో కొంతభాగం ఏడు నెంబర్లలో వివిధ వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. ఈ భూములపై కన్నేసిన ఫీల్డ్ అసిస్టెంట్ ధనాంజనేయులు 2019లో ఎన్నికల విధుల నిమిత్తం యాడికికి వచ్చిన ఒక అధికారిని ప్రలోభ పెట్టి తన భార్య పేరుతో నాలుగు ఎకరాల భూమిని పట్టా చేయించుకొని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడు. ఇదే భూమిని గతంలో చిన్నబాలన్న అనే దళితుడికి ఇచ్చి ఉన్నారు. అతడి కుటుంబికులు ఈ భూమి విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఫీల్డ్ అసిస్టెంట్ భూబాగోతం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఆరాతీసిన రెవెన్యూ అధికారులు సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌కు మూడు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించ లేదని తెలిసింది. దీనిపై రెవెన్యూ అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఒత్తిడి చేయడంతో అతను వైసీపీ నాయకులను ఆశ్రయించినట్లు సమాచారం. దీంతో ఓ వైసీపీ నాయకుడు తన అనుచరులతో రెవెన్యూ కార్యాలయానికి వచ్చి గ్రామస్థాయి రెవెన్యూ అధికారిని బెదిరించినట్లు కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

బెదిరింపులకు లొంగని రెవెన్యూ సిబ్బంది



సదరు భూమిని ఆన్‌లైన్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ తన భార్య పేరుతో నమోదు చేయించుకున్న దృశ్యం

ఫీల్డ్ అసిస్టెంట్ భూ ఆక్రమణను అరికట్టే దిశలో బెదిరింపులు ఎదురైనా రెవెన్యూ సిబ్బంది లొంగకుండా చర్యలు చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఆక్రమించిన భూమిని గతంలో రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చిన వ్యక్తులకు చెందేలా చర్యలకు ఉపక్రమించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ రెవెన్యూ అధికారులతో బేరసారాలకు దిగినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. తాను పట్టా చేయించుకున్న నాలుగు ఎకరాల భూమిలో హరిజన చిన్నబాలన్నకు ఉన్నది రెండు ఎకరాల భూమి మాత్రమే అని, మిగిలిన భూమి తన భార్య పేరుతో అలాగే ఆన్‌లైన్‌లో ఉంచాలని వేడుకున్నట్లు సమాచారం. దీనికి లొంగని రెవెన్యూ అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు మిగులు భూములు ప్రభుత్వానికి చెందాల్సిందేనని చెప్పినట్లు సమాచారం. అలాగే తాను ఆక్రమించుకున్న భూమికి తనకు ఎటువంటి సంబంధం లేదని లేఖ కూడా రాయించుకున్నట్లు తెలిసింది. దీనిని ఉన్నతాధికారులకు నివేదించి ఫీల్డ్ అసిస్టెంట్ ఆక్రమించుకున్న భూమిని స్వాధీనం చేసుకొనే దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

రెవెన్యూ అధికారికి వైసీపీ హెచ్చరిక

ఫీల్డ్ అసిస్టెంట్ భూ ఆక్రమణకు మద్దతుగా పదిరోజుల కిందట వైసీపీ నాయకులు రెవెన్యూ కార్యాలయానికి పెద్దఎత్తున వచ్చారు. గ్రామస్థాయిలో ఉండే రెవెన్యూ అధికారిని హెచ్చరించినట్లు స్థానికుల సమాచారం. ఇక్కడి నుంచి నీవు బదిలీ అయినా ఇంకా ఎందుకు ఇక్కడే ఉంటున్నావ్ వెళ్లి పోవచ్చు కదా అని ఆ అధికారిని పరుష పదజాలంతో హెచ్చరించారు. మా ఉన్నతాధికారులు నన్ను రిలీవ్ చేసినప్పుడు నేను ఇక్కడి నుంచి వెళతాను మీరెవరు నన్ను ప్రశ్నించడానికి అని ఆ అధికారి కూడా దీటుగా సమాధానం ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది.

ఫీల్డ్ అసిస్టెంట్‌తో స్టేట్‌మెంట్ తీసుకున్నాం

422-8 భూమిని ఫీల్డ్ అసిస్టెంట్ గతంలో తన భార్య పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్న మాట వాస్తవమే. దీనిపై వారికి నోటీసులు జారీచేశాం. వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నాం. దీనిని ఆర్డీఓ ద్వారా డీఆర్వోకు పంపించాల్సి ఉంది. అధికారుల ఆదేశాలతో ఆ భూమిని ప్రభుత్వానికి చెందేలా చేస్తాం. - రమేష్, వీఆర్వో యాడికి

టపాసులతో జాగ్రత్త

అక్రమంగా విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు : ఎస్పీ



అనంతపురం క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చట్ట వ్యతిరేకంగా టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. బాణసంచా విక్రయ లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే టపాసులు విక్రయించాలని, లేని వారు ఎవరైనా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళిని పురస్కరించుకుని జిల్లాలో లైసెన్స్ కలిగిన దుకాణదారులు పాటించాల్సిన నియమ, నిబంధనలు, ప్రజలు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాత్కాలిక లైసెన్స్‌దారులు ప్రభుత్వ యంత్రాంగం సూచించిన బహిరంగ ప్రదేశాల్లో నిర్దీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 18సంవత్సరాలలోపు పిల్లలను విక్రయ పనుల్లో ఉంచుకోరాదన్నారు. నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ప్రమాదం జరిగినా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్-100/112 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరవేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం 30 శాతం ఐఆర్ ప్రకటించాలి

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరిప్రసాద్

అనంతపురం విద్య, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ రిపోర్ట్ వచ్చేలోపు ఉద్యోగులు,ఉపాధ్యాయులకు దీపావళి కానుకగా వెంటనే 30 శాతంఐఆర్ ప్రకటించాలని పీఆర్టీయూ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరి ప్రసాద్ కోరారు. ఆదివారం ఆ సంఘం నాయకులు యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు, ఉపాధ్యాయులు జీతాలు వెంటనే వేస్తుండటం హర్షణీయమన్నారు. ఈ ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. పీఆర్సీ ఆలస్యమైతే ఐఆర్ ఇచ్చే సంస్కృతిని గతంలో మొట్టమొదట 1999లో సీఎం చంద్రబాబు తీసుకొచ్చారని గుర్తు చేశారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ ఆలస్యమవుతోందన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు తాత్కాలిక భృతి ప్రకటించి, వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లాప్రధానకార్యదర్శి తిమ్మారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ తిరుపాల్, శివారెడ్డి, ఎల్లప్ప, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిప్రసాద్

చిన్నారి పెళ్లికూతురు

పాపంపేటలో బాల్యవివాహం...!

అనంతపురం విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే ఓ పేటలో బాలికకు వివాహం చేసినట్లు తెలిసింది. తల్లిదండ్రులు తమ 14 ఏళ్ల కుమార్తెకు రహస్యంగా వివాహం చేసినట్లు సమాచారం. అనంతపురం రూరల్ మండలంలో నివాసం ఉంటున్న దంపతులు తమ మైనర్ కుమార్తెను కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన వరుడికి ఇచ్చి ఆదివారం ఉదయం వివాహం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఐసీడీఎస్, చైల్డ్ లైన్ అధికారులు బాలిక దంపతులకు కౌన్సెలింగ్ కూడా ఇచ్చినట్లు తెలిసింది. అధికారుల మాటలు బాలిక తల్లిదండ్రులు పెడచెవిన పెట్టి పెళ్లి చేసినట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలోనే ఇలా బాలికలకు పెళ్లిళ్లు చేస్తుంటే...ఇక జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ బాల్య వివాహంపై ఐసీడీఎస్ పీడీ శ్రీదేవిని వివరణ కోరగా ఇటీవల తమ శాఖాధికారులు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చిన విషయం వాస్తవమేనన్నారు. ఒక వేళ రహస్యంగా పెళ్లి చేసి ఉంటే... విచారణ చేయించి వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



గాయపడిన మహిళ

కార్లపై రాళ్లదాడి

జాతీయ రహదారిపై ఘటన

ఇరువురికి గాయాలు

హిందూపురం, అక్టోబరు, 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి వెంట వెళ్తున్న కార్లపై గుర్తుతెలియని దుండగులు రాళ్లదాడి చేశారు. ఈ ఘటనలో కార్లలో ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలైనట్లు బాధితులు తెలిపారు. పెనుకొండకు చెందిన కేదరినాథ్ బెంగళూరుకు వెళ్లి అక్కడ తన కుమార్తెను పండుగ కోసం కార్లో తీసుకువస్తున్నాడు. ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో సోమందేపల్లి మండలం నల్లగొండరాయనపల్లి సమీపంలోకి వచ్చే సరికి గుర్తు తెలియని దుండగులు కారుపై రాళ్లు విసిరారు. దీంతో బెంబేలెత్తిన వారు కారును ఆపకుండా పెనుకొండకు వెళ్లారు. కారు అద్దాలు ధ్వంసమై కుమార్తె చందనకు గాయాలవగా.. భార్య అశ్విని తల కిందకు దించుకోవడంతో తప్పించుకుంది. పెనుకొండకు చెందిన భగత్ భార్య గోరంట్లకు వెళ్లి కారులో తిరిగి వస్తున్నారు. వీరికి కూడా 10 నిమిషాల వ్యవధిలో చీకట్లో నుంచి రాళ్ల దాడి చేశారు. వీరి వాహనానికి కూడా అద్దాలు పగిలాయి. కారులో ఉన్న బిన్నిశ్రీకి స్వల్ప గాయాలయ్యాయి. వీరు కూడా పెనుకొండ వరకు కారు ఆపకుండా వెళ్లారు. అనంతరం వారు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి గాలించారు. ఎవరూ కనిపించకపోవడంతో వెనుతిరిగి వచ్చారు. దీనిపై ఎస్‌ఐ రమేష్‌ను సంప్రదించగా.. చీకట్లో ఉండి ఎవరో రాళ్ల దాడి చేశారనీ, వారు మద్యం మత్తులో చేశారా, ఆకతాయిల పనా తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని ఎస్‌ఐ పేర్కొన్నారు.



పగిలిన కారు అద్దాలు

పేద విద్యార్థికి ఆర్థికసాయం

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఔదార్యం



అనంతపురం అర్బన్, అక్టోబరు27(ఆంధ్ర జ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదవిద్యార్థి ఉన్నత చదువుల కోసం గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ ఆర్థిక సాయం చేశారు. అనంతపురానికి చెందిన ఓ పేద విద్యార్థిని ఉన్నత చదువులకు ఆదివారం ఆయన రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. కష్ట సమయంలో ఆర్థిక సాయం అందించి, చదువు కొనసాగించడానికి అండగా నిలిచిన గౌస్‌మొద్దీన్‌కు ఆ విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

రాయదుర్గంరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నీటి గుంతలో ఈతకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణ శివారు బీటీపీ లేఅవుట్‌లో ఆదివారం జరిగింది. ఈ లేఅవుట్‌లో నివాసం ఉం టున్న హరి, వరలక్ష్మి దంపతుల కుమారుడు కళ్యాణ్‌రామ్(19) పిల్లలతో కలిసి కాలనీ సమీపంలోని నీటి గుంత వద్దకు ఈతకు వెళ్లాడు. దరికి అనుకుని ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు లోతు ఎక్కువ ఉన్న ప్రాంతానికి వెళ్లి పోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆందోళన చెందిన తోటి వారు గుంత నుంచి ఒడ్డుకు చేరుకున్నారు. ఇంతలోనే ఈతకెళ్లిన కుమారుడు ఎంతసేపటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రు లు బంధువులతో కలిసి కుమారుడిని వెదుకుతూ నీటి గుంత వద్దకు చేరుకుని పరిశీలించారు. నీటి అడుగులో ఉన్న కళ్యాణ్‌రామ్‌ను బయటకు తెచ్చి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

న్యూస్‌బాక్స్

పంచాయతీ స్థలాల

అక్రమాలపై కొరడా

అధికారులపై పీఆర్ కమిషనర్ వేటు

ఎంపీడీఓ, కార్యదర్శి సస్పెన్షన్

అనంతపురం విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలాల కేటాయింపులో అక్రమాలకు పాల్పడిన అధికారులపై పంచాయతీరాజ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఒక ఎంపీడీఓ, మరో పంచాయతీ సెక్రెటరీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగు చూశాయి. పెద్దవడుగూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న బారెన్ సాహెబ్ గతంలో ఉరవకొండలో పంచాయతీ సెక్రెటరీగా పనిచేశారు. అలాగే ఇటీవలి వరకూ రాప్తాడులో పనిచేసి బుక్కరాయసముద్రానికి వచ్చిన గ్రేడ్-1 పంచాయతీ సెక్రెటరీ పెద్ద శ్రీనివాసులు సైతం గతంలో ఉరవకొండలో సెక్రెటరీగా పనిచేశారు. గతంలో వారిద్దరూ పంచాయతీ స్థలాల కేటాయింపులో అక్రమాలకు పాల్పడటంతోపాటు, వాటిని సంరక్షించడంలో విఫలమయ్యారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లాయి. సుదీర్ఘకాలం పాటు డీపీఓ, ఇతర అధికారులు విచారణ చేశారు. విచారణలో అక్రమాలు రుజువు కావడంతో ఆ ఇద్దరిపై పీఆర్ కమిషనర్ కృష్ణతేజ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ, కార్యదర్శులను సస్పెండ్ చేశారు.

మట్టి కోసం

కూటమిలో రగడ

టీడీపీ నాయకుల ఎక్స్‌కవేటర్ అద్దాలను పగలకొట్టిన జనసేన నాయకులు

ధర్మవరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మట్టి తవ్వకాలపై టీడీపీ, జనసేన నాయకుల మధ్య రగడ మొదలైంది. ధర్మవరం మండలం రేగాటిపల్లిలో ఆదివారం మట్టి అక్రమ రవాణా చేస్తున్న టీడీపీ నాయకులకు చెందిన ఎక్స్‌కవేటర్‌ను జనసేన నాయకులు ధ్వంసం చేశారు. ఇక్కడ మట్టి తవ్వాలంటే తాము తప్ప వేరేవారు రాకూడదని జనసేన నాయకులు హుకుం జారీ చేసినట్టు తెలిసింది. గ్రామ సమీపంలో మట్టి తవ్వి రవాణా చేస్తున్నారు. ఇదే పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు తాము కూడా మట్టిని తవ్వుకుంటామని పలుమార్లు జనసేన నాయకులకు విన్నవించామని తెలిపారు. ఇందుకు జనసేన నాయకులు ఒప్పుకోకపోవడంతో రేగాటిపల్లి కొండసమీపంలో మట్టిని తవ్వేందుకు టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు వచ్చి మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌పై రాళ్లు విసిరి అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై టీడీపీ నాయకులు.. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ధ్వంసమైన ఎక్స్‌కవేటర్ అద్దం

వేరుశనగ రైతుకు నిరాశే

అమాంతం పడిపోయిన ధర

గిట్టుబాటుపై భరోసా ఇవ్వని ప్రభుత్వం

ఆందోళనలో రైతులు



గాండ్లపెంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎండనక, వాననక కష్టపడే రైతులు సాగుచేసిన పంటలు చేతికందితే సాగుఖర్చులు, పిల్లల చదువులు, జీవనోపాధితోపాటు, చేసిన అప్పులు తీర్చుకోవచ్చని ఎదురు చూస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలను ఎదుర్కొని అరకొరగా పంట చేసుకొచ్చినా ధర తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాండ్లపెంటమండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్‌లో వర్షాధారం కింద 3,200 ఎకరాల్లో వేరుశనగ సాగుచేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వేరుశనగ విత్తనకాయలు 40 శాతం సబ్సిడీతో 30కిలోల బస్తా రూ.1,710కు అందించారు. ఎకరా సాగుకు దుక్కి, ఎరువులు, కలుపు, చీడపీడల నివారణకు రూ.20వేలు ఖర్చు చేశారు. వర్షాధారం కింద ఎకరాకు ఐదు బస్తాలు కూడా దిగుబడి రాలేదు. గత యేడాది 44 కి లోల బస్తా ధర రూ.3,500కు పైగా పలికింది. ప్రస్తుతం బస్తా ధర రూ.2వేలకు పడిపోయింది. దీంతో రైతులు పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా అందకుండా పోతున్నాయి.


> ఒకప్పుడు మెట్ట ప్రాంతంలో పంట అంటే వేరుశనగే గుర్తొచ్చేది. రానురాను ఆ పంట అంతరించిపోయే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో వేరుశనగ సాగు చేసి రాసులు వేసిన రైతులు.. ఇప్పుడు నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఈసారైనా పంట రాకపోతుందా.. కష్టాలు తీరకపోతాయా అనే ఆశతో సాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. ముంగార్లకు మురిపించిన వరుణుడు మధ్యలో ఎగదీసి.. తీరా పంట ఇంటికి చేర్చే సమయంలో కుళ్లబెట్టి నట్టేట ముంచాడు. ఉన్న ధరలు కూడా అమాంతం పడిపోయాయి. ఇతర పంటలలాగే వేరుశనగకు కూడా గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పడిపోయిన ధరలు

మెట్ట ప్రాంత రైతులు ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుచేస్తారు. అక్టోబరు నెలలో పంట తొలగిస్తారు. ఈనెలలో అల్పపీడన ప్రభావాలతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో పలువురు రైతులు వేరుశనగను తొలగించారు. వర్షానికి తడవడంతో నాణ్యత లోపించింది. మరి కొంత మంది రైతులు పంటను తొలగించి పొలాల్లోనే వదిలివేయడంతో కుళ్లిపోయింది. దీం తో పాటు కా యలు మొలకలొచ్చి నల్లగామారిపోయాయి. నాణ్యత లేవంటూ వ్యాపారులు బస్తా రూ.రెండు వేలకు కొనుగోలు చేస్తున్నారు. ధరలు తగ్గిపోవడంతో ఎలా అమ్మేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వేరుశనగ పంటకు కూడా మద్దతు ధర ప్రకటించి.. కరువు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



వేరుశనగ కాయలు తొలగిస్తున్న కూలీలు



ఇంటివద్ద ఆరబెట్టుకున్న వేరుశనగ కాయలు

పంట ఖర్చులు కూడా రావు : మస్తానప్ప, మునగలవారిపల్లి



నేను రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వర్షాధారం కింద వేరుశనగ సాగుచేశాను. ఎకరా సాగుకు రూ.20వేలకు పైగా ఖర్చు వచ్చింది. మొత్తం రూ. 50వేలు పెట్టుపెట్టాను. రెండున్నర ఎకరాలకు కనీసం 10 బస్తాలుకూడా దిగుబడి రాలేదు. ఉన్నఫలంగా ధరలు కూడా పడిపోయాయి. ప్రభుత్వం మద్దతుధర ప్రకటిస్తే పెట్టుబడులైనా దక్కుతాయి. ప్రభుత్వం స్పందించి వేరుశనగ రైతులను ఆదుకోవాలి.

వేరుశనగ సాగుచేస్తే నష్టాలే : రామమోహన్, పోతినేపల్లి



వేరుశనగ పంట సాగు చేస్తే నష్టాలే మిగులుతున్నాయి. గతంలో కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసి నష్టపోయాం. వేరుశనగ సాగుచేయడం వల్ల పశుగ్రాసం వస్తే కొద్దిగా ఉపయోగం ఉండేది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా తడిసిపోవడంతో పశుగ్రాసానికి పనికిరాకుండాపోయింది. మరోవైపు ధరలు లేకపోవడంతో గిట్టుబాటు కనిపించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వేరుశగకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.





ట్రోఫీలు అందుకుంటున్న అనంతపురం బాలుర, బాలికల జట్లు

అనంత అద్వితీయం..

ఫుట్‌బాల్‌లో తిరుగులేని జిల్లా జట్లు

రాష్ట్రస్థాయి అండర్-14 టోర్నీలో చాంపియన్లుగా అవతరణ

హిందూపురం అర్బన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా బాలబాలికలు ఫుట్‌బాల్‌లో అదరగొట్టారు. రాష్ట్రస్థాయి అండర్-14 టోర్నీలో విజేతలుగా నిలిచారు. స్థానిక ఎంజీఎం క్రీడామైదానంలో మూడురోజులపాటు నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 ఫుట్‌బాల్ టోర్నీలో బాలబాలికల విభాగాల్లో అనంతపురం జిల్లా జట్లు చాంపియన్‌గా అవతరించాయి. ఆదివారం నిర్వహించిన బాలికల విభాగ ఫైనల్లో అనంతపురం, తూర్పుగోదావరి జిల్లాల జట్లు తలపడ్డాయి. అనంత జట్టు 4-0 గోల్స్ తేడాతో తూర్పుగోదావరి జట్టును చిత్తుచేసి, విజేతగా ఆవిర్భవించింది. తూర్పుగోదావరి రన్నరప్ కాగా.. చిత్తూరు, పశ్చిమ గోదావరి జిల్లాల జట్లు వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి.

బాలురు సైతం..

బాలుర విభాగ ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. అనంతపురం జట్టు 4-0 గోల్స్ తేడాతో అద్భుత విజయం సాధించింది. చాంపియన్‌గా అవతరించింది. శ్రీకాకుళం రన్నరప్‌గా, విశాఖ, చిత్తూరు జిల్లాల జట్లు వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి.

నవంబరులో జాతీయ స్థాయికి...

టోర్నీలో ప్రతిభ కనబరచిన పలువురిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నవంబరులో మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో వీరు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని టోర్నీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేత జట్లకు ఎంఈఓ గంగప్ప, టీడీపీ కౌన్సిలర్లు రమేష్‌కుమార్, చంద్రకళ, సతీష్‌కుమార్, అయూబ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు రామకృష్ణ ట్రోఫీలను ప్రదానం చేశారు.

రహదారులు

రక్తసిక్తం..

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

నలుగురికి గాయాలు

మృతుల్లో చిన్నారి

హిందూపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లు రక్తమోడాయి. ఆదివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా.. నలుగురు గాయపడ్డారు. శుభకార్యం కోసం ఆర్మీలో పనిచేస్తున్న ఉద్యోగి సొంతూరికి వచ్చాడు. మొదటి రోజు శుభకార్యం ముగించుకుని రెండో రోజు కార్యక్రమానికి సంబంధించి సరుకులు తేవడానికి హిందూపురం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో టైరు పంక్చరై ఇంటిని ఢీకొని ఇద్దరు మృతిచెందారు. మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో రెండు రోజులపాటు ఇంటిల్లిపాదీ సంతోషంగా ఉండాల్సిందిపోయి విషాదంలో మునిగిపోయారు. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు.. పరిగి మండలం కాలువపల్లికి చెందిన ప్రవీణ్‌కుమార్ ఆర్మీలో సిగ్నల్ విభాగంలో పనిచేస్తున్నారు. శనివారం నామకరణం కార్యక్రమానికి బంధువులంతా కాలువపల్లికి చేరుకున్నారు. రాత్రి 10గంటలు దాటాక ప్రవీణ్ వరుసకు అన్న అయిన బొజ్జప్పతో కలిసి హిందూపురం బోయపేటకు చెందిన యువకుడు నరహరి కారులో హిందూపురానికి వచ్చి సరుకులు తీసుకున్నారు. పని ముగించుకుని అర్ధరాత్రి కాలువపల్లికి వెళ్తున్నారు. మోతుకపల్లి వద్దకు వెళ్లేసరికి కారు పంచర్ అయి నాగులకట్ట, చెట్టును ఢీకొని అనంతరం రోడ్డుపక్కన ఉన్న ఇంటిని ఢీకొంది. ఈ ఘటనలో బొజ్జప్ప (44), నరహరి (26) అక్కడికక్కడే మృతిచెందారు. కొద్దిసేపటి తరువాత స్థానికులు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. వారు కాలువపల్లి నుంచి వచ్చి నరహరి, బొజ్జప్ప, ప్రవీణ్‌కుమార్‌ను హిందూపురం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నరహరి, బుజ్జప్ప మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రవీణ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా అతన్ని వెంటనే ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆర్మీ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. మృతి చెందిన బొజ్జప్పకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రవీణ్‌కుమార్ కుమారుడి శుభకార్యానికి సెలవు పెట్టి వచ్చారు. ఇక్కడికి వచ్చి మొదటి రోజు శుభకార్యాన్ని రెండోరోజుకూడా ఎంతో సంతోషంగా గడపాలనుకున్నారు. కానీ అనుకోని సంఘటనతో ఇంటిల్లిపాది వచ్చిన బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నరహరి (ఫైల్)



బొజ్జప్ప (ఫైల్)

వేగం తెచ్చిన తంటా..

కారు వేగంగా వెళుతూ అదుపుతప్పి ఢీకొన్నట్లు తెలుస్తోంది. కాలువపల్లి నుంచి హిందూపురం వెళ్లే సమయంలో ఆ కారు వేగంగా వెళ్లినట్లు మోతుకపల్లి వాసులు తెలిపారు. తిరుగు ప్రయాణంలో కూడా అదేవేగంగా వచ్చి అదుపుతప్పి ఢీకొని ఉంటుందని అనుమానిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు పంచర్ అయినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎప్పటిలాగా పడుకుని ఉండుంటే..

మోతుకపల్లిలో కారు ఢీకొన్న ఇల్లు వంటగది పాక్షికంగా దెబ్బతింది. ఆ ఇంటిలో ముగ్గురు నివసిస్తున్నారు. వారిలో ఇద్దరు పెళ్లి కోసం వేరే ఊరికి వెళ్లారు. మరొకరు వేరేగదిలో పడుకున్నారు. వారు ఎప్పుడూ ప్రమాదం జరిగిన గదిలోనే పడుకునేవారు. అదృష్టవశాత్తు పక్కగదిలో ఉండటంతో తప్పించుకున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. చిన్నారి మృతి



జోయాను ఎక్స్‌రేకు తీసుకెళ్తున్న బంధువులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో చిన్నారి మృతి చెందిన సంఘటన హిందూపురం మండలం మణే సముద్రం ఏ1 స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. సోమందేపల్లిలోని నక్కలగుట్ట ప్రాంతానికి చెందిన బేల్దారి పని చేసే బాబావలి పిల్లలకు జ్వరం వస్తుండడంతో భార్య మెహర్‌తాజ్, పెద్ద కుమార్తె అష్రఫ్ అలియా (7), చిన్న కుమార్తె జోయాతో కలిసి హిందూపురానికి ద్విచక్రవాహనంలో వస్తున్నారు. మణేసముద్రం ఏ1 స్టీల్ ఫ్యాక్టరీ వద్దకు రాగానే ఎదురుగా మరో ద్విచక్రవాహనంలో వస్తున్న ఒంగోలుకు చెందిన యోనా, అతడి స్నేహితుడు వేగంగా వెళ్లి ఢీకొన్నారు. ఈ ఘటనలో అలియా అక్కడికక్కడే మృతి చెందగా బాబావలికి తీవ్ర గాయాలయ్యాయి. మరో చిన్నారి జోయాకు ఎడమ కాలు విరిగింది. ప్రైవేట్ అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు చరణ్ పరిశీలించి అలియా అప్పటికే మృతి చెందిందని, బాబావలిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. బంధువులు ఆసుపత్రికి చేరుకొని చిన్నారి మృతదేహం వద్ద విలపించిన తీరు అందరినీ కలిచివేసింది.

అందుబాటులోకి రాని 108..

ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎంత సేపటికి 108 అందుబాటులోకి రాలేదని బాధితులు తెలిపారు. దీంతో ప్రైవేట్ అంబులెన్స్‌లో మృతదేహం, గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం వెళ్లాలన్నా గంటల తరబడి 108 వాహనం అందుబాటులోకి రాలేదని వైద్యులు పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు..

పరిస్థితి విషమం



సురేంద్ర (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఎస్ గేటు సమీపంలో రామగిరికి వెళ్లే రోడ్డుపై ఆదివారం ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు... రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన సురేంద్ర (49) తన బావమరిది రామాంజనేయులుతో కలిసి ఎన్ఎస్ గేటు నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తున్నారు. మండల సరిహద్దులోకి వెళ్లగానే ఎదురుగా వచ్చిన ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. సురేంద్ర, రామాంజనేయులు తీవ్రంగా గాయపడటంతో అనంతపురం తరలిస్తుండగా సురేంద్ర మృతి చెందాడు. రామాంజనేయులు పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగుళూరుకు తరలించినట్టు తెలిసింది.

దుస్తుల వ్యాపారి..

నల్లమాడ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగంపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుస్తుల వ్యాపారి మృతి చెందాడు. ఎస్ఐ దాదాపీర్ తెలిపిన వివరాల మేరకు.. కదిరి పట్టణంలోని మశానంపేటకు చెందిన ఖాజాపీర్ (48) ద్విచక్రవాహనంపైన బట్టల వ్యాపారం చేసుకునేవాడు. ఆదివారం నల్లమాడ మండలానికి వచ్చి తిరుగు ప్రయాణంలో కదిరికి వెళ్తుండగా ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు జారడంతో కిందపడ్డాడు. ప్రమాదంలో ఖాజాపీర్ తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బెంగుళూరు నుంచి కదిరికి వస్తుండగా.. సంఘటనను చూసి వాహనాన్ని నిలిపారు. వెంటనే గాయపడిన ఖాజాపీర్‌ను ఆటోలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే వైద్యులతో ఫోన్‌లో సంప్రదించి వైద్యం చేయాలని సూచించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య ఆఫ్రీన్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ప్రమాదస్థలం నుంచి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

పొదుపు సొమ్ము

రూ. 72 లక్షలు స్వాహా

వెలుగు, బ్యాంకు అధికారుల కుమ్మక్కు

న్యాయం చేయాలని ఎమ్మెల్యేని కోరిన మహిళా సంఘాలు



వెలుగు అక్రమాలపై ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు

కళ్యాణదుర్గం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లికార్జునపల్లిలో మహిళా సంఘాల సభ్యుల పొదుపు సొమ్ము రూ. 72 లక్షలను వెలుగు, బ్యాంకు అధికారులు కుమ్మక్కై కాజేశారని సంఘాల సభ్యులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు విన్నవించారు. ఆదివారం ఎమ్మెల్యే ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా.. దారి మధ్యలో మల్లికార్జునపల్లికి చెందిన మహిళా సంఘాల సభ్యులు వెలుగులో జరిగిన అవినీతి, అక్రమాలపై ఆయనకు విన్నవించారు. కూలి పనులు చేసుకుని పొదుపు చేసుకున్న డబ్బును సుమారు రూ.72 లక్షల దాకా వెలుగు, బ్యాంకు అధికారులు కుమ్మక్కై కాజేశారని వాపోయారు. గత ఏడాది నుంచి మహిళా సంఘాల సభ్యులందరూ పోరాటం చేస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని, వెలుగు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వారు మొరపెట్టుకున్నారు. తమకు న్యాయం చేయాలని, తమ డబ్బును రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మీరు అధైర్యపడవద్దని, మీ సొమ్మును రికవరీ చేసే బాధ్యత తను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

జిల్లా క్రికెట్ సంఘం

తాత్కాలిక కార్యదర్శిగా భీమలింగారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం తాత్కాలిక కార్యదర్శిగా భీమలింగారెడ్డిని ఎన్నుకున్నారు. ఇది వరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్న మధు ఆచారి వివిధ ఆరోపణలు, క్రీడాకారులు, తల్లిదండ్రుల ఫిర్యాదులతో పదవికి రాజీనామా చేసి తప్పుకున్నారు. దీంతో కార్యదర్శి పదవి ఖాళీ అయింది. ఈ క్రమంలో చాలా మందికి కార్యదర్శి పదవిపై కన్నుపడింది. ప్రధానంగా బీసీసీఐ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌ల నుంచి జిల్లా క్రికెట్ సంఘానికి నిధులు పుష్కలంగా ఇస్తుండడం, ఇక్కడే జాతీయ స్థాయి మ్యాచ్‌లు నిర్వహిస్తుండడంతో కార్యదర్శి పదవికి పోటీ తీవ్రమైంది. గతంలో జిల్లా క్రికెట్ సంఘంలో పనిచేసి అనేక అవినీతి, ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తులు సైతం తిరిగి ఆ పదవి కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం ఉన్న జిల్లా క్రికెట్ సంఘానికి ఏడాది పాటు గడువు ఉంది. సంఘాన్ని ప్రక్షాళన చేస్తారా... తాత్కాలికంగా నడిపిస్తారా అనేది నూతనంగా ఎన్నికైన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌పై బాధ్యత ఉంది. ముఖ్యంగా జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అనంతపురం మండలం, నియోజకవర్గాల కమిటీల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం ఇవ్వడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సెలెక్షన్ కమిటీల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. వీటన్నింటినీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ క్రమంలో తాత్కాలికంగా జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శిగా సహాయ కార్యదర్శిగా ఉన్న భీమలింగారెడ్డికి బాధ్యతలు అప్పజెప్పారు. త్వరలో పూర్తి స్థాయి కార్యదర్శిని నియమిస్తారా లేక పూర్తి కమిటీని నియమిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

గల్లంతైన వ్యక్తి మృతి

కణేకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెణెకల్లు గ్రామానికి చెందిన వన్నప్ప(48) అనే వ్యక్తి శనివారం వేదావతి హగరిలో గల్లంతు కాగా ఆదివారం మధ్యాహ్నం హగరిలో శవమై తేలాడు. వన్నప్ప బిదురకుంతానికి చెందిన సర్పంచ్ హనుమంతప్ప పొలంలో పప్పుశనగ సాగు చేసేందుకు పనికి వస్తున్నట్లు శనివారం ఉదయం ఫోన్ చేసి తెలిపాడు. ఇందు కోసం వన్నప్ప రెండు గ్రామాల మధ్య ఉన్న వేదావతి హగరిని దాటే సమయంలో గల్లంతయ్యాడు. రాత్రి వరకు విషయం ఎవరికి తెలియకపోవడంతో అతడి కోసం బంధువులు వెతకసాగారు. పోలీసులకు కూడా సమాచారం అందించారు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆదివారం గాలింపు చర్యలు చేపట్టగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో హగరిలో వన్నప్ప శవం తేలింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లింగమ్మతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంఘటన స్థలాన్ని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధు పరిశీలించారు.

ఆరేళ్ల బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

- పోలీసుల అదుపులో నిందితుడు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలికపై 70 ఏళ్ల వయస్సు ఉన్న ఓ వృద్ధుడు అత్యాచారానికి యత్నించిన సంఘటన మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం జరిగింది. బాలిక మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆడుకుంటుండగా వృద్ధుడు మాయ మాటలు చెప్పి తన ఇంటిలోకి తీసుకెళ్లాడు. ఓ గదిలో బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. పసిగట్టిన బాలిక ప్రతిఘటించే ప్రయత్నం చేయగా, చంపుతానని బెదిరించాడు. చివరికి ఎలాగోలా అతడి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకున్న బాలిక జరిగిన విషయాన్ని ఏడ్చుకుంటూ తల్లికి తెలిపింది. వెంటనే తల్లి వెళ్లి వృద్ధుడిని నిలదీయగా అతడు బుకాయించాడు. దీంతో ఆమె జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు గ్రామానికి వెళ్లి వృద్ధుడిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌ను తరలించి విచారిస్తున్నట్టు తెలిసింది. దీనిపై ఎస్ఐ సత్యనారాయణను వివరణను కోరగా తమకు సమాచారం రాగానే వృద్ధుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. కాగా కొందరు పెద్ద మనుషులు కేసు నమోదు కాకుండా రాజీ చేస్తున్నట్లు తెలిసింది.



వధూవరులతో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వధూవరులకు టీడీపీ సభ్యత్వ నమోదు

కనగానపల్లి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): వధూవరులు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. మండలంలోని తగరకుంట గ్రామంలో ఆదివారం రమ్య, సూర్యతేజకు వివాహమైంది. వారి వివాహానికి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా వివాహ వేదికపైన ఎమ్మెల్యే, క్లస్టర్ ఇన్‌చార్జ్ పూజారి రాజాకృష్ణ, కన్వీనర్ యాతం పోతలయ్య చేతులమీదుగా వధూవరులు సభ్యత్వ నమోదు చేయించుకున్నారు.

టీటీసీ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ

అనంతపురం విద్య, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): టీటీసీ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షల కేంద్రాన్ని డీఈఓ ప్రసాద్‌బాబు తనిఖీ చేశారు. ఆదివారం నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో టీటీసీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి 1 గంట వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకూ, మధ్యాహ్నం 3.30 నుంచి 5 గంటల వరకూ మూడు సెక్షన్లలో నిర్వహించారు. పరీక్షలకు 93 మందికిగాను 87 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. ఏసీ గోవింద్ నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాడుతాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

శింగనమల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై పోరాడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. ఆదివారం మండలంలోని నిదనవాడ గ్రామంలో సీపీఎం మండల మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి రాంభూపాల్, కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య, ఓ నలప్ప హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పంటనష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి రాయితీ రూ.20 వేలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యదర్శిగా భాస్కర్, సభ్యులుగా 13 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో కొండారెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.4.86 లక్షలు

అనంతపురంరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.4,86,050 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,77,630, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.2,08,420 వచ్చిందని తెలిపారు.

భర్త చేసిన అప్పులకు.. భార్య ఆత్మహత్య

అనంతపురం క్రైం,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భర్త కొట్టడు.. తిట్టడు.. కానీ ఆ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు ప్రధాన కారణం భర్త ఆన్‌లైన్ జూదంలో చేసిన అప్పుల చిట్టా. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.40లక్షల అప్పు చేశాడు. పెద్దలు కుదిర్చి పెళ్లయినా భర్త అంటే బోలెడంత ఇష్టం ఆమెకు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియలేదు. భర్త ఇబ్బంది పెట్టకపోయినా పరోక్షంగా ఒత్తిళ్లు ఎదుర్కొంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ సచివాలయ ఉద్యోగిని ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం సిండికేట్‌నగర్‌లో నివాసముంటున్న సచివాలయ ఉద్యోగిని మానస ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అనంతపురం రూరల్ పోలీసులకు ఆదివారం అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మానస కూడేరు మండలం ఉదిరిపికొండ సచివాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త మల్లికార్జున శెట్టూరు మండలంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఎక్కువగా ఆడేవాడు. ఆ క్రమంలో రూ.లక్షల్లో అప్పులు చేశాడు. చివరికి అది రూ.40లక్షల వరకు ఉన్నట్లు తేలింది. శెట్టూరు మండలంలో నాలుగు నెలల క్రితం పింఛన్ డబ్బు రూ.5.50లక్షలు కాజేసిన ఘటనలో ముద్దాయిగా జైలుకెళ్లొచ్చాడు. భర్త చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మానసిక క్షోభతో మానస ఆత్మహత్య చేసుకుంది.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు బీటర్లను నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి తపోవనం సర్కిల్‌లో పోలీసులు దాడులు నిర్వహించారు. మట్కా నిర్వహిస్తున్న నారాయణపురం గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ ఖాసీం, శ్రీనివాసనగర్‌కు చెందిన మంగలి రామమూర్తి, జగదీష్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,50,200, ఇతర సమాగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా మట్కా, పేకాట, బెట్టింగ్‌లు నిర్వహిస్తుంటే సమాచారం అందించాలని సీఐ కోరారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు బోయ సాయికుమార్, తలారి పోతులయ్యలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డాబాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న మరో ఐదుగురిపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

స్థలం ఆక్రమించారని మహిళ ఫిర్యాదు

అనంతపురం క్రైం,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తన స్థలం ఆక్రమించారని నగరంలోని ఓ మహిళ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఆకుతోటపల్లి భాస్కర్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... వేణుగోపాల్‌నగర్‌కు చెందిన మీనాక్షికి మూడున్నర సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలంలో ఎనిమిది అడుగులను భాస్కర్ రెడ్డి ఆక్రమించారని ఆమె ఫిర్యాదులో ఆరోపించింది. తాను వేసుకున్న కంచెను తొలగించారని, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టించుకోరా..?





గ్రానైట్ దుకాణం

- ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న గ్రానైట్ దుకాణాలు
- దర్జాగా వ్యాపారం.. పంచాయతీకి పన్ను ఎగవేత
- రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్న వైనం..
- ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి
- పంచాయతీ అధికారుల మీనమేషాలు

అనంతపురంరూరల్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంతం వ్యాపారాలకు పెట్టింది పేరు. పలానవి ఎక్కడ దొరుకుతాయంటే.. ఈ ప్రాంతం పేరు ఇట్టే చేప్పేస్తారు. జిల్లా కేంద్రం మొదలు కొని, చుట్టుపక్క ప్రాంతాల్లో ఎవరిని అడిగినా ఈ ప్రాంతం పేరు తెలియని వారుండరు. ఆ స్థాయికి చేరింది ఈ ప్రాంతం. నిత్యం కొనుగోలుదారులతో అక్కడి షాపులు సందడిగా ఉంటాయి. వ్యాపారులకు ఆదాయం దండిగానే సమకూరుతోంది. ఈ ప్రాంతంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా రోజురోజుకు షాపుల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయి. కొనుగోలు దారులను ఆకర్షించేందుకు వివిధ మోడళ్లు అందుబాటులోకి తీసుకురావడం. తద్వారా వాటిని విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు. అయినా ఏం పంచాయతీకి పన్ను చెల్లించేందుకు మాత్రం వ్యాపారులకు చేతులు రాని దుస్థితి. ఏళ్ల తరబడి షాపుల నిర్వహణ జరుగుతున్నా పంచాయతీకి ఒక్క పైసా చెల్లించరు. పంచాయతీ అధికారులు సైతం పన్ను వసూళ్లలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ ప్రాంతం మరేదో కాదండయో.. నగరానికి అత్యంత సమీపంలోని బళ్లారి రోడ్డు ప్రాంతం. ఆ వ్యాపారం కూడా మరేదో కాదు.. గ్రానైట్ వ్యాపారం.

వందల సంఖ్యలో గ్రానైట్ వ్యాపార సముదాయాలు..

ఈ ప్రాంతం రూరల్ మండల పరిధిలోని ఎ.నారాయణపురం పంచాయతీలోకి వస్తుంది. పంచాయతీ పరిధి ప్రారంభం నుంచి అనంతపురం-బళ్లారి రోడ్డుకు ఇరువైపులా గ్రానైట్ వ్యాపార సముదాయాలు వెలిశాయి. రోడ్డు పొడవునా ఇవే కనిపిస్తాయి. ఎంతలేదన్నా వంద తగ్గకుండా ఉంటాయి. రోజురోజుకు ఈ షాపుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆ స్థాయిలో ఇక్కడ వ్యాపార సముదాయాలుంటున్నాయి. ఒక్కొక్కటి పది సెంట్లకు పైగా విస్తీర్ణంలోనే ఏర్పాటయ్యాయి. వీటిలో చాలా వరకు ఏళ్ల తరబడి ఏర్పాటు చేసుకున్నవే. తమ లాభాలను పెంచుకునేందుకు వివిధ రకాల మార్బుల్స్, గ్రానైట్ తెప్పించి విక్రయాలు చేస్తున్నారు. ఆ షాపుల నుంచి ఇంత వరకు పంచాయతీకి మాత్రం ఆదాయం దక్కింది శూన్యం. దర్జాగా వ్యాపారం చేసుకుంటూ పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారు. వంద దుకాణాలుంటే నాలుగైదు మాత్రమే పన్ను చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. అదికూడా గతంలో పంచాయతీ అధికారిగా పనిచేసిన ఓ అధికారి పన్ను చెల్లింపులకు నోటీసులు జారీ చేసి నాలుగైదు షాపులతో రూ.5వేలు వరకు పన్ను కట్టించినట్లు తెలుస్తోంది.

పన్ను వసూళ్లకు చర్యలు



గ్రానైట్ వ్యాపారులు పన్ను చెల్లించడం లేదన్నది వాస్తవమే. తప్పనిసరిగా పంచాయతీకి పన్ను చెల్లించాలి. గతంలో పనిచేసిన అధికారులు పన్ను చెల్లింపులకు వారికి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఆ మేరకు మరోసారి విచారించి నోటీసులు జారీ చేస్తాం. పన్ను వసూలుకు చర్యలు తీసుకుంటాం.

- ప్రవీణ్‌బాబు, కార్యదర్శి, ఎ.నారాయణపురం

పన్ను వసూలుచేస్తే లక్షల్లో ఆదాయం..

పంచాయతీల్లో సాధారణంగా అయితే ఇళ్లకు ఇంటి విస్తీర్ణాన్ని బట్టి పన్ను విధిస్తారు. ప్రస్తుతం షాపులన్నీ కమర్షియల్ ల్యాండ్‌లో ఉన్నాయి. దీనికి తోడు ఒక్కొక్కటి పది సెంట్లపైగా విస్తీర్ణంలో ఉంటున్నాయి. ఈలెక్కన ఒక్కొక్కదానికి సరాసరిన రూ.10వేలు పన్ను రూపంలో కట్టించినా పంచాయతీకి లాభం చేకూరుతుంది. ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న వాటితో మరింత ఎక్కువ పన్ను చెల్లింపులు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఎంత లేదన్నా ఏడాదికి రూ.10లక్షలు ఆదాయం వస్తుంది. పంచాయతీ అవసరాల దృష్ట్యా సంబంధిత అధికారులు షాపులు నుంచి పన్ను వసూళ్లకు చర్యలు చేపట్టాలి.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

గార్లదిన్నె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలిశారు. ఆనందంగా ఆలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఆదివారం కొప్పలకొండ ఉన్నత పాఠశాలలో 2006లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పండుగలా సాగింది. చదువుకున్న రోజుల్లో చేసిన తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నారాయణరెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాశింబి, వెంకటలక్ష్మిలను సత్కరించారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న టీడీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు చురుకుగా చేపడుతున్నారు. ఆదివారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పలువురి చేత సభ్యత్వాలు తీసుకున్నారు. చెన్నేకొత్తపల్లిలో పార్టీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, నాయకులు ఏపీ శ్రీనివాసులు, మహేశ్, ఈడిగ భార్గవగౌడ్, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కోరం లేకుండానే సర్వసభ్య సమావేశం

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఆదివారం సర్వసభ్య సమావేశాన్ని కోరం లేకుండానే నిర్వహించారని పలువురు సభ్యులు ఆరోపించారు. గత ఆర్థిక సంవత్సరం రూ.5 కోట్ల ఆదాయం రాగా అందులో రాబడులు, వ్యయ అంశాలపై స్పష్టలేకుండానే తీర్మానాలు చేయడం దుర్మార్గమని వాపోయారు. ఈ విషయంపై కళాశాల అధికారులను వివరణకోరగా అభివృద్ధి గిట్టని వారు ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

రాయదుర్గం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చెకుముకి సైన్స్ సంబరాలు ద్వారా విద్యార్థు లు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సంబరాలను ఆయన ప్రారంభించారు. సైంటిస్ట్ డాక్టర్ కామూర్తి రవితేజ పాల్గొని ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. 24 మండలాలకు చెందిన జట్లు సైన్స్ పరీక్షలు రాయగా ప్రభుత్వ పాఠశాలల నుంచి గుత్తి మోడల్ స్కూల్ ఎంపిక కాగా ప్రైవేటు పాఠశాలల నుంచి అనంతపురానికి చెందిన లక్ష్మీ సినర్జీ హైస్కూల్ రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నాలుగు లక్షల మంది విద్యార్థులు పాల్గొంటున్న ఏకైక సైన్స్ కార్యక్రమం చెకుముకి సంబరాలని చెప్పారు. ఈ రెండు పాఠశాలల విద్యార్థులు నవంబరు 9, 10వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ, అనంతపురం నగర గౌరవ అధ్యక్షుడు గంగినాయక్, రాయదుర్గం గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ అయూబ్, అధ్యక్ష, కార్యదర్శులు వీరన్న, జగదీష్, మాంతేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాండురంగస్వామి స్పర్శదర్శనం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో స్వామివారి నిజపాద స్పర్శదర్శనం సోమవారం నిర్వహించనున్నట్లు భవసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్ ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏకాదశి సందర్భంగా భక్తుల చేతులమీదుగా స్వామివారి పాద స్పర్శ చేయిస్తామన్నారు. భక్తులు విరివిగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

రామగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎస్ఐ సుధాకర్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తామని, యువకులు పాల్గొనాలని కోరారు.

చైతన్యవంతమైన సమాజ నిర్మాణమే సంఘ్ ధ్యేయం

● ఆర్ఎస్ఎస్ క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్



నగరంలో పథసంచలనం నిర్వహిస్తున్న సేవకులు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హిందువులను సంఘటితంచేసి చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ధ్యేయమని క్షేత్రసేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వచ్చే ఏడాది శతాబ్దిలోకి అడుగిడుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలో పథ సంచలన్(స్వయంసేవకుల మార్చ్) నిర్వహించారు. ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 1925 సంవత్సరం విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందని తెలిపారు. వచ్చే విజయదశమికి శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. అనంతరం స్వయం సేవకులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

విడపనకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాల పల్లి గ్రామం వద్ద హంద్రీ నీవా కాలువ బ్రిడ్జిపై ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. విడపనకల్లుకు చెందిన కురుబ జయరాం, శివమ్మ దంపతులు వ్యక్తిగత పని మీద ఉరవకొండకు బైక్‌పై బయలు దేరారు. కొట్టాల పల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువ బ్రిడ్జి వద్దకు రాగానే ఉరవకొండ నుంచి బళ్లారికి వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో దంపతులు కిందకు పడి గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

గుంతకల్లుటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దారు రమాదేవి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరగనుందన్నారు. జేసీ, ఇతర శాఖల ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

శ్మశాన వాటిక దారి కబ్జా

రాయదుర్గంరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎన్ హళ్లి గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే దారిని ఓ రైతు కబ్జా చేశాడు. దీంతో శ్మశాన వాటికకు దారి లేకుండా పోయింది. ఈ క్రమంలో దళిత కాలనీకి చెందిన చిన్న మారెప్ప(58) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని ఖననం చేసేందుకు బంధువులు శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు అష్టకష్టాలు పడ్డారు. చివరికి ఆ రైతును ప్రాధేయపడి మృతదేహాన్ని పంట పొలాల్లో మోసుకెళ్లి శ్మశానికి చేర్చా రు. ఉన్న దారిని రైతు కబ్జా చేయడంతో శ్మశానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు వారు తెలిపారు. తహసీల్దార్ స్పందించి శ్మశానవాటిక దారిని ఏర్పాటు చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పూజ



పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

గార్లదిన్నె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్ప దేవాలయంలో ఆదివారం రాత్రి వైభవంగా అయ్యప్పస్వామి పూజా కార్యక్రమం నిర్వహించారు. అయప్పస్వామి మాల ధరించి హైదారాబాదు నుంచి శబరిమలకు కాలినడకన వెళుతున్న 80 మంది అయ్యప్ప స్వాములకు ఆదివారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులు విడిది ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వాములు పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కమిటీ కొనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెక్క నాగిరెడ్డి, రంగనాయకులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

కళాపోషకుడు సుధాకర్‌బాబు



సుధాకర్‌బాబు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ సకల కళాపోషకుడు అని విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు అన్నారు. సుధాకర్‌బాబు తెలుగు వెలుగు జాతీయ నంది పురస్కారానికి ఎంపికవడంతోపాటు ఏపీ రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ ప్రాధికార సంస్థ కమిటీ సభ్యుడుగా ఎంపికైన నేపథ్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో అనంత కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నాగరాజు మాట్లాడుతూ ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా ఎంతోమంది విద్యాభ్యాసానికి కృషి చేయడంతోపాటు ఉద్యోగ విరమణానంతరం సంగీత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం సుధాకర్‌బాబు దంపతులకు జ్ఞాపిక బహూకరించి సత్కరించారు. ఎల్‌కేపీ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ, జీవీ రామయ్య, రామాంజి, మాలమురళి, శ్రీదేవి, ఓబులదాస్, మహిధర్, సంస్కార భారతి లక్ష్మి, ఎల్ఐసీ మధు, విజయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత ఎస్ఎస్‌బీఎన్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వాలీబాల్ విజేతగా ఎస్ఎస్‌బీఎన్ జట్టు నిలిచింది. ఎస్కే యూనివర్శిటీ అంతర్ కళాశాలల ఏ గ్రూపు క్రీడా పోటీలు రెండు రోజులుగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఇందులో వాలీబాల్ విజేతగా ఎస్ఎస్‌బీఎన్ ఐదేళ్ల తరువాత నిలిచిందని పీడీ ప్రసాద్ తెలిపారు. సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విజేతగా నిలవగా, ద్వితీయ స్థానంలో ఎస్ఎస్‌బీఎన్ జట్టు నిలిచింది. టేబుల్ టెన్నిస్ పోటీల్లో కదిరి ఎస్‌టీఎస్ఎన్ కాలేజీ నిలవగా ఎస్ఎస్‌బీఎన్ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల యాజమాన్యం విజేతలతో పాటు పీడీని అభినందించింది.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా క్రిష్ణమూర్తి

కనగానపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా కుర్లపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణమూర్తి ఎంపికయ్యారు. తన ఎంపిక పట్ల కలెక్టర్ చేతన్‌కు, అధికారులకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల భద్రత కోసం పాటుపడతానన్నా రు. రెసిడెన్షియల్ పాఠశాలలో సీట్ల ఎంపికకు కృషిచేసి అందరికీ అందుబాటులో ఉంటానన్నారు.

మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి

● ఆల్‌మేవా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఫక్రుద్దీన్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆల్‌మేవా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని నేషనల్ పీజీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర ఆల్‌మేవా వార్షిక మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫక్రుద్దీన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ సామాజికవర్గానికి చెందిన అనేక పేద కుటుంబాలున్నాయని, వారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. వక్ఫ్ అమెండ్మెంట్ యాక్టును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించి, వక్ఫ్‌బోర్డు ఆధీనంలోనే ఉండేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి 15 సూత్రాల పథకం అమలులో ఆల్‌మేవా తరఫున ప్రతి జిల్లా కమిటీలోనూ ఇద్దరు చొప్పున సభ్యులను నియమించి పథకం సమగ్రంగా అమలయ్యేలా చొరవ చూపాలన్నారు. కనీసం మూడు నెలలకోసారి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారుల సమీక్ష సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆల్‌మేవా కర్నూలు జిల్లా అధ్యక్షుడు షేక్షావలి, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫారూక్ మొహ్మద్, హిదయతుల్లా, జిలాన్‌బాషా, మహబూబ్‌బాషా, మహబూబ్ దౌలా పాల్గొన్నారు.



మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు సమస్యలు వివరిస్తున్న ఫక్రుద్దీన్

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మొయిన్ బజారులో గల బీరప్ప గుడి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని కోట వీధినుంచి బైక్‌పై వస్తున్న షాషావలిని బీరప్ప గుడి వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ప్రమాదంలో షాషావలితో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వారిని చికిత్సనిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి..

గుత్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మనోసత్రం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన హుసేన్ బైక్‌లో గుత్తికి వస్తుండగా మనోసత్రం సమీపంలో రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో హుసేన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులకు..

విడపనకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామం వద్ద హంద్రీ నీవా కాలువ బ్రిడ్జిపై ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. విడపనకల్లుకు చెందిన కురుబ జయరాం, శివమ్మ దంపతులు వ్యక్తిగత పని మీద ఉరవకొండకు బైక్‌పై బయలు దేరారు. కొట్టాల పల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువ బ్రిడ్జి వద్దకు రాగానే ఉరవకొండ నుంచి బళ్లారికి వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో దంపతులు కిందకు పడి గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక కోర్టు తీర్పుపై హర్షం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ యాక్టు కేసులో 98మందికి కర్ణాటక కోర్టు తీర్పు జీవిత ఖైదు విధించడం హర్షణీయమని గుంతకల్లు ఎస్సీ, ఎస్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రం కొప్పల్ జిల్లా మరకుంబి గ్రామంలో గత ఆగస్టు 28న సినిమా టికెట్ కొనే విషయంలో దళితులపై అగ్రవర్ణాల వారు దాడులు చేసి ఇళ్లను తగులపెట్టారు. ఈ కేసుపై కొప్పల్ జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ జరిగి దాడి చేసిన అగ్రవర్ణాలకు చెందిన 98 మందికి జీవితఖైదు, మరో ముగ్గురికి ఐదు సంవత్సరాలు శిక్ష ఖరారు చేసిందన్నారు. ఈ తీర్పుతో దళితులకు న్యాయం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ దళిత సమితి అధ్యక్షుడు మహేంద్ర, న్యాయవాది కోరి చంద్రశేఖర్, నాయకులు భీమలింగ, ఎర్రిస్వామి, రామచంద్ర, గజ్జల రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

గుంతకల్లుటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దారు రమాదేవి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమం జరగనుందన్నారు. జేసీ, ఇతర శాఖల ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కళ్యాణదుర్గంరూరల్: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఆర్డీఓ వినూత్న ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల డివిజనల్ అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు పాల్గొని ఏమైనా సమస్యలు వుంటే అర్జీలను అందజేయాలని సూచించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సాధరణ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహించనున్నామన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బెళుగుప్ప, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 29వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దవడుగూరు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిమాకులపల్లి గ్రామశివారులో ఆదివారం 11మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.11520 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ అంజనేయులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పేకాట ఆడుతున్న 11మందిని అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరి ఆత్మహత్య

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. విట్లంపల్లి గ్రామానికి చెందిన ఎర్రిస్వామి (61) కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రిస్వామి గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలుచోట్ల చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో ఆదివారం నొప్పి అధికమవడంతో తాళలేక తన పశువులదొడ్డిలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వన్నమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

అదేవిధంగా నుసికొట్టాల తండాకు చెందిన కుమార్ నాయక్ (31) భార్య తరచుగా పుట్టింటికి వెళుతుందనే బాధతో గత శుక్రవారం తన ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్యగీతాబాయి, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆ ఘటనలపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఆటో డ్రైవర్లతో సమావేశం

తాడిపత్రి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో సోమవారం సాయంత్రం 5గంటలకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన ఆటోడ్రైవర్లు, యజమానులు, అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు.

అడవి కాదు.. జగనన్న కాలనీ

● ఏపుగా పెరిగిన కంపచెట్లు ● ఇళ్లు నిర్మించుకోవడానికి ఆసక్తి చూపని లబ్ధిదారులు




హోతూరు, రాయంపల్లి రోడ్లలో కాలనీల్లో ఏపుగా పెరిగిన చెట్లు

ఉరవకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హోతూరు రహదారి, రాయంపల్లి రహదారిలో ఉన్న జగనన్న కాలనీలు కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవులను తలపి స్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో హోతూరు రహదారిలో సర్వే నెంబరు 279లో 84మంది లబ్ధిదారులకి ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. ఉరవకొండకు 2 కి.మీల దూరంలో ఈ జగనన్న కా లనీ ఏర్పాటు చేయడంతో అక్కడ ఇళ్లను నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కాలనీ అంతా ముళ్ల పొదలతో నిం డిపోయింది. అలాగే రాయంపల్లి రోడ్డులోని సర్వే నెంబరు 603లో 235 మంది లబ్ధిదారులకి ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. అక్కడ వర్షం వస్తే నీరు భారీగా నిలుస్తోంది. దీంతో ప్రాంతంలోనూ ఇళ్ల నిర్మించుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పిచ్చి మొక్కలు పెరిగాయి. నివాసయోగ్యం కాని చోట ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం వల్ల ఈ దుస్థితి ఏర్పడింది.

ఆలయాల అభివృద్ధికి పాటుపడదాం

● మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి డబ్బులు ఇస్తామంటారే కానీ.. సేవ చేయడానికి మాత్రం ఎవరూ ముందుకురారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పురాతనమైన బుగ్గ రామలింగేశ్వర స్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాలు పట్టణంలో ఎంతో ప్రసిద్ధి గాంచినవని తెలిపారు. వాటిని మనమంతా కాపాడుకుని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆలయాల్లో ఏదేని అభివృద్ధి పనులు చేపట్టాలంటే ప్రజలు డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకుంటారే కానీ.. స్వయంగా వచ్చి ఎవరూ పట్టించుకోరని వాపోయారు. ఇది ఎంతో దురదృష్టకరమన్నారు. హంపీ తర్వాత తాడిపత్రిలో ఈ ఆలయాలు నిర్మించారంటే ఇక్కడ స్థల ప్రభావం ఎంత ఉందో అర్థం చేసుకోవాలన్నారు. తాడిపత్రిలో హిందూ ఆలయాలతోపాటు మసీదులు, ఈద్గాలు, దర్గాలు, చర్చిల అభివృద్ధికి ప్రజలు స్వయంగా వచ్చి సహాయ పడాలని ఆయన కోరారు.

హెచ్చెల్సీలో పూడికతీత పనుల పరిశీలన

పుట్లూరు: మండలకేంద్రం శివారులోని హెచ్చెల్సీలో పుట్లూరు పుల్లారెడ్డి సొంత నిధులతో చేపడుతున్న పూడికతీత పనులను ఆదివారం జేసీ ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హెచ్చెల్సీ పూడికతీత పనులు చేసేందుకు అధికారులెవరూ ముందుకు రారని, మనమే శుభ్రం చేసుకోవాలని తెలిపారు. సుమారు 20ఏళ్ల నుంచి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ముళ్లపొదలను పుల్లారెడ్డి తొలగింపజేయడం సంతోషదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడితేనే మూడు చెరువులకు నీళ్లు వస్తాయన్నారు. అనంతరం కాలువకు లస్కర్లను ఎందుకు ఏర్పాటు చేయలేదని హెచ్చెల్సీ అధికారులను ఫోన్‌చేసి ప్రశ్నించారు. తర్వాత ఆయన పుట్లూరు పుల్లారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, కులశేఖర్‌రెడ్డి, జయుడు, సత్యంరెడ్డి, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రంగయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

యాడికి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం యాడికిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సీఐ ఈరన్న ఆదివారం తెలిపారు. చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించే రక్తదాన శిబిరానికి రక్తదాతలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తాడిపత్రి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కడపరోడ్డులో ఆదివారం అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఆదిరెడ్డిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 40టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి మద్యం విక్రయిస్తున్న గన్నెవారిపల్లికాలనీకి చెందిన ఆదిరెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

5 లీటర్ల నాటుసారా స్వాధీనం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుంతకల్లుఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వెంకటాంపల్లి తండాలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం రాత్రి 5లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 450లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదేవిధంగా పట్టణంలోని పాతగుంతకల్లులోని వాల్మీకి సర్కిల్‌లో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు అన్నపూర్ణ తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి: ఎమ్మెల్సీ

ఉరవకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రభుత్వం ప్రజలపై భారం మోపడం తగదని, పెంచిన ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఇది చాలదన్నట్లు కరెంటు చార్జీలను పెంచి వారిపై మోయలేని భారం మోపారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఐదేళ్ల వరకూ విద్యుత్ చార్జీలను పెంచమని చంద్రబాబు హామీ ఇచ్చి నాలుగున్నర నెలల్లోనే ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆయన కోరారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ పత్రిష్ఠలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, వాల్మీకి సంఘం నాయకులు

బొమ్మనహాళ్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో ఆదివారం వాల్మీకి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. మండపంలో తొలుత అర్చకులు గణపతి పూజ, రక్షాంధనం, పంచగవ్యం, మండప పూజ, యంత్రాభిషేకం, జలాధివాసం, యంత్ర విగ్రహ స్థాపన, బలిపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత వేద మంత్రాల నడుమ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. తర్వాత మాట్లాడుతూ.. శ్రీరాముని చరితను ప్రపంచానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి అన్ని యుగాల్లో పూజ్యనీయుడని అన్నారు. చెడు నుంచి మంచికి మారి మహర్షి అయ్యారని తెలిపారు. ప్రతిఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, మహేంద్ర, బెళ్లి హనుమంత రెడ్డి, గాలి బసప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి జయంతి



బోరంపల్లిలో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కూడేరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బోయ, వాల్మీకి సోదరులు తమ ఆరాధ్య దైవమైన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మండలకేంద్రంతో పాటు అరవకూరులో ఆదివారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వాల్మీకి మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. సాయంత్రం వాల్మీకి చిత్రపటాలను ప్రత్యేక వాహనాల్లో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.

కళ్యాణదుర్గంరూరల్: మండలంలోని బోరంపల్లిలో వాల్మీకి జయంతి వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఊరేగిస్తూ నృత్యాలు చేశారు. మహిళలు, చిన్నారులు కేరింతలతో ర్యాలీ ఆద్యంతం సందడిగా కొనసాగింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కణేకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బిస్మిల్లా ఫంక్షన్‌హాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారు 42 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తర్వాత తమకు చదువు చెప్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

యాడికి: మండలకేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1990-91 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 33 ఏళ్ల తర్వాత వారందరూ అదే పాఠశాలలోనే కలిసి ఆనందంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ గురువులను సన్మానించారు.



కణేకల్లులో పూర్వ విద్యార్థులు



యాడికిలో..

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి



గుర్రం నారాయణస్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాళ్యం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గుర్రం నారాయణస్వామి ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జయరాం, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, ఆయన కుమారుడు దర్శతేజ్, కౌన్సిలర్లు పవన్‌కుమార్ గౌడ్, మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు ఆ గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నారాయణస్వామి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. నారాయణస్వామి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

జోరుగా పప్పుశనగ సాగు

● ఇటీవల వర్షాలకు పదునైన నల్లరేగడి నేలలు
● ఇదే అదునుగా విత్తనం వేస్తున్న రైతులు



కరకముక్కలలో ఎద్దులతో పప్పుశనగ విత్తనం వేస్తున్న రైతులు

విడపనకల్లు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సకాలంలో రావటంతో మండలంలోని నల్లరేగడి పొలాలు అదునుకు పదునయ్యాయి. దీంతో మండల రైతులు పప్పుశనగ విత్తనాన్ని సాగు చేయటం మొదలు పెట్టారు. మాళాపురం, పెద్ద కొట్టాల పల్లి, కరకముక్కల, విడపనకల్లు, గడేకల్లు, హావళిగి, డొనేకల్లుతో పాటు వివిధ గ్రామాల్లో పప్పుశనగ సాగు చేస్తున్నారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వానలు రావటంతో భూములన్నీ తేమ ఎక్కువయ్యాయి. లో తట్టు భూములు బురద మయంగా ఉన్నాయి. మిట్ట భూముల్లో తేమ ఆరి పోవటంతో రైతులు విత్తనం వేయటం మొదలు పెట్టారు. ఎకరాకు 45 నుంచి 50 కేజీల విత్తనం వేస్తున్నారు. విత్తనం ఖర్చు ఎకరాకు రూ. 8వేలు అవుతోందని రైతులు తెలుపుతున్నారు. అదును దాటిన తరువాత విత్తనం సాగు ఫలితం ఉండదని, ఈ నెల చివరి లోపు దాదాపుగా విత్తనం పడి పోవాలని రైతులు అంటున్నారు.


8 ఎకరాల్లో సాగు చేశాను



అదునులో పొలాలు పదునయ్యాయి. నేను 8 ఎకరాల్లో పప్పు శనగ సాగు చేశాను. ఎకరాకు రూ. 8వేలు ఖర్చు అవుతున్నాయి. నల్లరేగడి పొలాల్లో పప్పుశనగ లు సాగు చేయటం వల్ల దిగుబడి బాగానే ఉంటుంది.

- ఎం గోపాల్, పెద్ద కొట్టాల పల్లి

కంది కంటే పప్పుశనగ సాగుకు ఖర్చు ఎక్కువ



కంది పంట సాగు చేయటం కంటే పప్పుశనగ సాగు చేయటం ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. కంది పైరును సాగు చేసేవరకూ మాత్రమే ఖర్చులు అవుతాయి. కానీ పప్పుశనగ సాగు చేసిన రోజు నుంచి ఖర్చుతో కూడుకుని ఉంటుంది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే రైతుకు కొంత గిట్టుబాటు కలుగుతుంది. లేదంటే పెట్టిన పెట్టుబడి కూడా రాదు.

- వెంకటస్వామి, మాళాపురం

ఆర్‌ఎస్‌ఎస్ సేవకుల ర్యాలీ



కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు

గుత్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ శతవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత భారత్ సేవక్ సమాజ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు కవాతు చేపట్టారు. అనంతరం అక్కడి నుంచి గాంధీ సర్కిల్, సీఎస్ఐ చర్చిరోడ్డు, మొయిన్‌బజారు మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. సేవకులకు పూలు చల్లి ప్రజలు స్వాగతం పలికారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్

రాయదుర్గం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చెకుముకి సైన్స్ సంబరాలు ద్వారా విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సంబరాలను ఆయన ప్రారంభించారు. సైంటిస్ట్ డాక్టర్ కామూర్తి రవితేజ పాల్గొని ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. 24 మండలాలకు చెందిన జట్లు సైన్స్ పరీక్షలు రాయగా ప్రభుత్వ పాఠశాలల నుంచి గుత్తి మోడల్ స్కూల్ ఎంపిక కాగా ప్రైవేటు పాఠశాలల నుంచి అనంతపురానికి చెందిన లక్ష్మీ సినర్జీ హైస్కూల్ రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు లక్షల మంది విద్యార్థులు పాల్గొంటున్న ఏకైక సైన్స్ కార్యక్రమం చెకుముకి సంబరాలని చెప్పారు. ఈ రెండు పాఠశాలల విద్యార్థులు నవంబరు 9, 10వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ, అనంతపురం నగర గౌరవ అధ్యక్షుడు గంగినాయక్, రాయదుర్గం గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ అయూబ్, అధ్యక్ష, కార్యదర్శులు వీరన్న, జగదీష్, మాంతేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక దారి కబ్జా

● అంత్యక్రియలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్న బీఎన్‌హళ్లి గ్రామస్థులు

రాయదుర్గంరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎన్‌హళ్లి గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే దారిని ఓ రైతు కబ్జా చేశాడు. దీంతో శ్మశాన వాటికకు దారి లేకుండా పోయింది. ఈ క్రమంలో దళిత కాలనీకి చెందిన చిన్న మారెప్ప(58) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని ఖననం చేసేందుకు బంధువులు శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు అష్టకష్టాలు పడ్డారు. చివరికి ఆ రైతును ప్రాధేయపడి మృతదేహాన్ని పంట పొలాల్లో మోసుకెళ్లి శ్మశానికి చేర్చారు. ఉన్న దారిని రైతు కబ్జా చేయడంతో శ్మశానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు వారు తెలిపారు. తహసీల్దార్ స్పందించి శ్మశానవాటిక దారిని ఏర్పాటు చేయాలని కోరారు.

ఆత్మీయ సదస్సును విజయవంతం చేయండి

రాయదుర్గం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకేంద్రంలో నవంబరు 5వ తేదీన మాదిగల ఆత్మీయ సదస్సు జరగనుందని, విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ పిలుపునిచ్చారు. పట్టణంలో వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ఇందులో హరిగోపాల్ మాట్లాడుతూ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి మాదిగలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ తాలూకా అధ్యక్షుడు వన్నూరుస్వామి, ఎంఈఎఫ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: అనంతపురంలో నవంబరు 5న మాదిగల ఆత్మీయ సదస్సు జరగనున్నట్లు ఎంఈఎఫ్ జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్ తెలిపారు. పట్టణంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని కోరుతూ నవంబరు 5న ఆత్మీయ సదస్సును నిర్వహిం చనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, మండల ఇన్చార్జి నరసింహులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఐషర్

● యువకుడికి తీవ్ర గాయాలు

గుత్తిరూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని యంగిలిబండ గ్రామశివారులోని 67 వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గుత్తి పట్టణానికి చెందిన రాజేంద్ర ద్విచక్రవాహనంలో జక్కలచెరువుకి వెళ్తుండగా యంగిలిబండ గ్రామశివారులో ఐషర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో రాజేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ఉరవకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిస్వార్థ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 350 మంది దాకా విద్యార్థులు పాల్గొన్నారు. రంగోలి, స్కి ప్పింగ్, పేపర్‌క్రాఫ్ట్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తిరుపతయ్య, సంస్థ సభ్యులు శ్రీనివాస్, శ్రీదేవి, శైలజ, వేణుగోపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.